


నాపై ఎటువంటి కేసులు లేవు : ఛైర్మన్ పద్మనాభరాజు

ప్రజాశక్తి - నాగలాపురం



నాపై ఎటువంటి కేసులు లేవని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఇదంతా కొందరు సృష్టిస్తున్నారని సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు స్పష్టం చేశారు. ఛైర్మన్ కార్యాలయంలో మీడియాతో శుక్రవారం మాట్లాడారు. సంబంధం లేని కేసులు వేసి తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పిచ్చాటూరు ఎంపిపిగా తన సతీమణి హయాంలో మండలాభివృద్ధికి కృషి చేశామన్నారు. దీన్ని గుర్తించడం వల్లే ఉత్తమ ఎంపిపిగా తన సతీమణి ఢిల్లీలో అవార్డు తీసుకున్నారని గుర్తు చేశారు. స్వామి దర్శనంలో భక్తులకు పెద్దపీట వేయడానికి తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. మాడ వీధుల్లో రథం తిప్పేందుకు వీలుగా సిమెంట్ రోడ్లు నిర్మించడానికి టిడిపి సమన్వయ కర్త శంకర్‌రెడ్డి ముందుకు వచ్చారన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న కోనేరు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాతలు కట్టించిన ఎనిమిది అతిథిభవనాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు హంసరుద్రయ్య, కవిత చంద్రశేఖర్, నెల్సన్‌మండేలా, ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ పాల్గొన్నారు.

అగ్రహారం..ఆర్తనాదం..!



బాలు పెద్దమ్మ



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, రామచంద్రాపురం

తిరుపతి రూరల్ వేదాంతపురం అగ్రహారం ఆర్తనాదాలతో మిన్నంటింది. తమను కడతేర్చాల్సిన బిడ్డ బాలు మృతితో తల్లి కుప్పకూలిపోయింది. గల్లంతైనవారిలో నా కొడుకు బతికుండాలి అంటూ ప్రకాష్ తల్లి దేవి గుండెలు బాదుకుంటూ పిచ్చిదానిలా కేకలు వేస్తూ వాపోయింది. 'కొడకా నిన్ను ఏడుకొండల స్వామే బతికిస్తాడు..గౌరమ్మ సోదిలో నువ్వు బతికున్నావనే చెప్పింది.. నాయనా ఇంటికొచ్చేయ్.. చీకట్లో నీకు భయం' అంటూ చంద్ర తల్లిండ్రులు బలరామిరెడ్డి, ఎల్లమ్మలు పొర్లుదండాలు పెడుతూ ఏడ్చుకుంటూ కనిపించారు. ఎక్కడ చూసినా ఏడుపులే. అయ్యో స్వర్ణముఖి కడుపున పెట్టుకున్నావా? అంటూ శాపనార్థాలు. ఏ పోలీసు వాహనం వచ్చినా గల్లంతైన పిల్లల కోసం ఎక్కడ చెడ్డ వార్త వింటామో అని వాహనం దగ్గరకు వచ్చే ధైర్యం లేక కాళ్లు చేతులు ఆడకుండా కనిపించారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వీరంతా అవిలాల వేదాంతపురం ప్రభుత్వ స్కూల్లో చదివిన తన విద్యార్థులని ఆ స్కూల్లో గతంలో పనిచేసిన టీచర్ ఎ.పద్మజ తెలిపారు.

స్వర్ణముఖిలో ఈతకెళ్లిన ఏడుగురు
ఒకరు మృతి.. నలుగురు గల్లంతు
ఇద్దరు బాలురు సురక్షితం



ప్రకాష్ తల్లి రోదన



స్పృహ కోల్పోయిన బాలు తల్లి (బాలు మృతదేహం)

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారానికి చెందిన ఆరుగురు విద్యార్థులు, ఒక మేకల కాపరి సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో ఊరికి సమీపంలో సిపిఆర్ విల్లాస్ వద్ద ఉన్న స్వర్ణముఖి నదిలో సరదాగా ఈతకు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన మునిస్వామిరెడ్డి, మంజులకు చెందిన ఇద్దరు కుమారులు తేజ (19), బాలు (16) కూడా వీరిలో ఉన్నారు. బలరామిరెడ్డి, ఎల్లమ్మ కుమారుడు చంద్ర (16), శ్రీనివాసులు, దేవి కుమారుడు ప్రకాష్ (16) ఉన్నారు. వీరితో పాటు వెళ్లిన విష్ణు, మణిరత్నం, కృష్ణ ప్రాణాలతో బయట పడ్డారు. మిగిలిన వారు గల్లంతు కావడంతో కేకలు వేసి గ్రామస్తులకు తెలియజేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈత కోసం స్వర్ణముఖి నది నీటి ప్రవాహంలోకి దిగిన ప్రకాశ్ (17), చిన్న (15), తేజు (19), బాలు (16) నీటి ప్రవాహం ఎక్కువగా రావడంతో తట్టుకోలేక ప్రవాహంలో కొట్టుకుపోయారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ సునీల్ నాయుడు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని స్వర్ణముఖిలో యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల గాలింపులలో బాలు(16) దొరికాడు. పోలీసులు వెంటనే బాలు ఛాతిని గట్టిగా అదిమి(సిపిఆర్) ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ బాలు అప్పటికే మతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులతోపాటు ఎన్ డి ఆర్ ఎస్ సిబ్బంది స్వర్ణముఖిలో గాలింపులు చేస్తున్నారు. స్వర్ణముఖిలో నలుగురు యువకులు గల్లంతు కావడం, పోలీసుల గాలింపుల చర్యలో బాలు (16) మతదేహాన్ని బయటకు తీయడంతో అగ్రహారంలో విషాదఛాయలు కలుముకున్నాయి. గల్లంతైన యువకుల తల్లిదండ్రులు బోరుమని విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో చర్చించారు. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, ఏ.ఎస్.పి రవి మనోహర్ ఆచారి, డీఎస్పీ బి ప్రసాద్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, తహశీల్దార్ రామాంజనేయులు నాయక్ గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. స్వర్ణముఖి నదిలో



యువకులు గల్లంతైన సంఘటన పట్ల ఎమ్మెల్యే పులపర్తి నాని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తడ నుంచి ఎన్‌డిఆర్‌ఎస్ బృందం వచ్చి గాలింపు చర్యలు అర్ధరాత్రి చేపట్టనుంది.

పుట్టినరోజే 'డెత్'డే

అగ్రహారానికి చెందిన ఎన్.మునస్వామిరెడ్డి, ఎన్.మంజులకు ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి తేజ, బిటెక్‌లో రాణించకపోవడంతో చదువు ఆపేశాడు. ఇంటివద్దనే ఉంటూ పశువులు మేపుకుంటూ ఉండేవాడు. చిన్నబ్బాయి బాలును దగ్గరలోనే 'గీతం'లో బిటెక్ చేర్పించారు. తండ్రి తిరుచానూరు ఎడిపై కాలేజీలో వ్యాన్ డ్రైవర్‌గా జీవనం గడుపుతున్నాడు. బాలు పుట్టినరోజు కావడంతో ఉదయం బట్టలు కొనుక్కుని, సాయంత్రం ఏడు గంటలకు కేక్ కట్‌చేయాలని బంధువులను, స్నేహితులను పిలిచారు. మధ్యాహ్నం సరదాగా ఈతకెళ్లిన సందర్భంగా బాలు మృతిచెందాడు. తేజ గల్లంతయ్యాడు. ఒకే కుటుంబంలో ఇద్దరు ఇలా ఉండడంతో ఆ తల్లిదండ్రుల వేదన అరణ్యవేదగా మారింది. కొడుకు మరణవార్త వినడంతో తల్లి మంజుల కుప్పకూలిపోయి స్పృహతప్పి పడిపోయింది. బాలు తాత 'తన మనవళ్లు ఎక్కడ' అని రోదించడం అందరినీ కలచివేసింది.

ఒక్కగాని ఒక్క కొడుకు నీళ్లపాలు

శ్రీనివాసులు, దేవిలకు కొడుకు, కూతురు. కొడుకు ప్రకాష్. ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి ఆరేళ్ల క్రితం కరోనా సమయంలో మేస్త్రి పనిచేస్తూ మృతిచెందాడు. తల్లి దేవి పిల్లలను ఉన్నత చదువులను చదివించాలని ఊళ్లో పిండిమిషన్ పెట్టుకుని జీవనం సాగిస్తోంది. ప్రకాష్ గల్లంతు కావడంతో ఆ తల్లి వేదన వర్ణనాతీతం.

ఇద్దరూ మునిగిపోయుండేవారు

బలరామిరెడ్డి, ఎల్లమ్మలకు ఇద్దరు కుమారులు. పెద్దవాడు చంద్ర గల్లంతయ్యాడు. చిన్నవాడు కుమార్ ఈతరాదని చెప్పి ఒడ్డునే ఉండడంతో బతికిపోయాడు.

అక్రమ తవ్వకాలే కారణమా?

స్వర్ణముఖి నది దాదాపు అర కిలోమీటర్ దూరం వెడల్పు ఉంటుంది. వర్షాకాలంలో వచ్చే నీరు సాఫీగా పోతూ ఉంటుంది. అయితే ఇసుకాసురుల అడ్డగోలు వ్యాపారం వల్ల స్వర్ణముఖిలో ఇసుకను రాత్రికిరాత్రే తోడేస్తున్నారు. దాదాపు 20-30 అడుగుల వరకూ మంచి ఇసుక ఉండడంతో తవ్వేసి గుంతలు చేసేశారు. ప్రస్తుతం ఈ మూడు రోజుల వర్షంతో స్వర్ణముఖి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం వీరు గల్లంతైన ప్రాంతంలో నీరు సమానంగా ఉండడంతో మోకాలి లోతేనని అనుకుని పిల్లలు ఈతకు దిగారు. అయితే గుంతలు ఉండడంతో గల్లంతయ్యారు.మృతుల కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సానుభూతి తెలిపారు. నీటి ప్రవాహాల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని ఆదేశించారు.



మా ఊరు వల్లకాడయ్యింది : హరి



చేతికి అంది వచ్చిన బిడ్డలను స్వర్ణముఖి పొట్టన పెట్టుకుంది. కని పెంచిన తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చింది. అగ్రహారానికి ఆవేదన కలిగించింది. ఒక్కరంటే ఒక్కరు పచ్చి మంచినీళ్లు ముట్టి ఉంటే ఒట్టు. బాలు నాకు వరుసకు బావమరిది. నిన్న సాయంత్రం నేను చిగురువాడ నుంచి వస్తుండగా 'మామ ఆగు' అని నా బండిలోనే వచ్చాడు. పుట్టినరోజుకు రేపు సాయంత్రం ఏడు గంటలకు రమ్మని చెప్పాడు. కేక్‌కట్‌చేసి చికెన్ తినిపోమని పిలిచాడు. 'నాయాలా ఉద్యోగం చేయరా ఫస్టు' అని వెటకారంగా మాట్లాడా. రమ్మని బతిమిలాడాడు. ప్రస్తుతం శవమై తేలాడు.



గ్రేటర్ తిరుపతిపై వాడివేడి చర్చలు

ఇక తిరుపతి 'గ్రేటర్'

- కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోదం
- కార్పొరేటర్ల మాటల యుద్ధం
- కార్పొరేటర్ తమ్ముడు గణేష్‌పై దాడి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం గ్రేటర్ అంశంపై రసాభసగా మారింది. వైసిపి, కూటమి కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం నడిచింది. తిరుపతిని గ్రేటర్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించడంతో అధికారులు కౌన్సిల్ అజెండాలో పొందుపరిచారు. ఇందులో తిరుపతి రూరల్‌తో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, ఏర్పేడు, చంద్రగిరి మండలాల్లోని కొన్ని పంచాయతీలను గ్రేటర్‌లోకలుపుతూ అజెండాను తయారు చేశారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్లో వందో అంశంగా గ్రేటర్ తిరుపతిని పెట్టారు.అయితే చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్ఎలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డిలు కొన్ని అభ్యంతరాలు తెలిపారు. గ్రేటర్ అంశంపై కూటమి ప్రభుత్వంలోఉండే కార్పొరేటర్లు ప్రస్తావించకూడదని ముందుగానే సంకేతాలు అందాయి. మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన శుక్రవారం ఎస్వీ సెనెట్ హాలులో కౌన్సిల్ సమావేశం జరిగింది. తిరుపతి ఎంపి గురుమూర్తితో పాటు ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తిరుపతిని గ్రేటర్ చేయాలని, కౌన్సిల్లో ఉండే అందరూ ఆమోదించాలని సూచించారు. అయితే తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు మాత్రం గ్రేటర్ తిరుపతికి తాము అనుకూలమేనని, అయితే చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్ఎల ప్రతిపాదనల్లో మరికొన్ని గ్రామాలు చేర్చాలని సూచించారని, ఈ అంశాన్ని తరువాత చర్చించి 15 రోజుల్లో గ్రేటర్‌పై కౌన్సిల్లో తీర్మానం చేయాలన్నారు. అయితే వైసిపి కార్పొరేటర్లు ఒప్పుకోలేదు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఒక దశలో వైసిపి, కూటమి కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం నడిచింది. పోడియం వద్దకు వెళ్లి వైసిపి కార్పొరేటర్లు ప్లకార్డులతో తిరుపతిని గ్రేటర్‌చేయాలని పట్టుబట్టారు. కౌన్సిల్లో వైసిపికి మెజార్టీ ఉండడంతో తిరుపతి గ్రేటర్ ఓకే అయ్యింది. దీంతో కూటమి కార్పొరేటర్లు అంగీకరించాల్సి వచ్చింది. అజెండాలో 108 అంశాలు పొందుపరచగా 107 అంశాలకు ఆమోదం తెలిపారు. ఒక అంశం వాయిదా పడింది.

> **గ్రేటర్ పంచాయతీలో కలవనున్న 63 పంచాయతీలు**
>
> **తిరుపతి గ్రేటర్‌లో 63 పంచాయతీలు కలవనున్నాయి. తిరుపతి రూరల్లో 33, రేణిగుంటలో 21, చంద్రగిరిలో 10, ఏర్పేడు మండలంలోని వికత మాల వరకు గ్రేటర్ ప్రతిపాదన పెట్టారు. సుమారు 7 లక్షల జనాభా కలిగిన దాన్ని గ్రేటర్ గా చేయనున్నారు. కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ తిరుపతి అజెండాలో ఆమోదం పొందిన తర్వాత పంచాయతీలకు వారి వారి అభిప్రాయం పంపనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో పంచాయతీ పాలకమండలి తీర్మానం ముగియనున్నది. దీంతో తిరుపతి గ్రేటర్ పలు పంచాయతీలు కలుపుతూ అన్ని పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయనున్నారు. తిరుపతి గ్రేటర్ ఏఏ పంచాయతీలు చేరతాయో వారి అభిప్రాయాన్ని నెల రోజుల్లో పంపాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుపతి గ్రేటర్ గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు ఉన్నతాధికారులకు ఆదేశించడం జరిగింది. అందులో భాగంగా గ్రేటర్ వైపు పంచాయతీలను విలీనం చేయనున్నారు.**

తమ్ముడు గణేష్‌పై దాడి

గ్రేటర్ తిరుపతి అంశంపై ప్రతి ఒక్కరూ మాట్లాడాలని మేయర్ శిరీష సూచించారు. 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌కె బాబు మాట్లాడుతూ తాను గ్రేటర్‌కు వ్యతిరేకం కాదని, అయితే ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు సూచించిన విధంగా మరిన్ని గ్రామాలు కలపాలని, మరో 15 రోజుల్లో సమావేశం పెడదామని సూచించారు. దీంతో మూడో డివిజన్ వైసిపి కార్పొరేటర్ తమ్ముడు గణేష్ ఎస్కేబాబుపై మాటల యుద్ధం చేయడంతో వాగ్వివాదం జరిగింది. నువ్వెంతంటే నువ్వెంత అని అరుచుకున్నారు. ఎస్కే బాబు అనుచరుడు తమ్ముడు గణేష్‌పై చేయి చేసుకోవడంతో రసాభస అయ్యింది. తమ్ముడు గణేష్ తనకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని మేయర్ శిరీష ఎదుట కూర్చుని నిరసన తెలిపారు. తమ్ముడు గణేష్‌పై దాడిచేసిన అతన్ని పోలీసులు బయటకు తీసుకెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

ఎంఆర్‌పల్లి స్మశాన వాటికను టిడిపి నేతలు కబ్జా చేస్తున్నారని కార్పొరేటర్ ఆరణి సంధ్యారెడ్డి ప్లకార్డులతో నిరసన తెలిపారు. కమిషనర్ మౌర్య స్పందిస్తూ ఎంఆర్‌పల్లి దగ్గర ఉన్న స్మశాన వాటిక వంద సంవత్సరాల క్రితం కాల్వపోరంబోకు స్థలమని, అందులో కొంతమందికి పట్టాలు ఇచ్చారని సర్వే చేసిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. స్మశానం కేవలం రెండు సెంట్లు మాత్రమే ఉందన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ తిమ్మినాయుడుపాలెం పంచాయతీ పరిధిలో 199 సర్వే నంబర్‌లో ఎకరా 90 సెంట్లు భూమిని టిడిపి నేతలు ఆక్రమించుకున్నారని, స్మశానాన్ని కాపాడాలని కోరారు. కోఆప్షన్ మెంబర్ శ్రీదేవి మాట్లాడుతూ కొర్లగుంట మారుతీనగర్‌లో 33 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ అర్బన్ హెల్త్ సెంటర్, లేదంటే మహిళాసంఘాల కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు. హథీరాంజీ మఠం కూల్చరాదని కార్పొరేటర్ నరసింహాచారి లేవనెత్తారు. కోఆప్షన్ మెంబర్ ఇమామ్ సాహెబ్ మాట్లాడుతూ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వద్ద ఉన్న ఈద్గా మైదానం సమస్య కొన్నేళ్లుగా ఉందని, రైల్వే అధికారులు ఆక్రమించుకుని ఇబ్బంది పెడుతున్నారన్నారు.

గ్రేటర్‌తోనే తిరుపతి అభివృద్ధి : మేయర్



అభివృద్ధి జరగాలంటే గ్రేటర్ తప్పనిసరని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. తిరుపతిలో అనేక విద్యాసంస్థలతోపాటు వైద్యపరంగా అభివృద్ధి చెందిందన్నారు. రేణిగుంట విమానాశ్రయం ఆనుకుని ఎన్నో అంతర్జాతీయ పరిశ్రమలు వస్తున్నాయని, తిరుపతి గ్రేటర్‌తో ఆదాయ వనరులుపెంచుకునే అవకాశం ఉందన్నారు. తమ హయాంలో 17 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేసి ట్రాఫిక్ సమస్యకు విముక్తి కల్పించామన్నారు. గ్రేటర్‌గా మారితే ఉద్యోగ అవకాశాలతో పాటు అనేక కొత్త కంపెనీలు తిరుపతికి వస్తాయన్నారు. ఆదాయ వనరులుపెరుగుతాయన్నారు. రాయలసీమలోనే తిరుపతికి చాలా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపి డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ కార్పొరేటర్ తమ్ముడు గణేష్‌పై దాడిచేసిన కూటమి నేతకు చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ సిఒసి బిల్డింగ్ నిర్మాణానికి నిధుల విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రూ.100 కోట్లు తెచ్చి పూర్తి చేయాలన్నారు. తిరుపతి గ్రేటర్‌కు కొన్ని ప్రతిపాదనలు వచ్చాయని, మరోసారి చర్చించి 15 రోజుల్లో కౌన్సిల్ సమావేశం పెట్టి గ్రేటర్‌పై తీర్మానం చేస్తామని ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు చెప్పారు. కమిషనర్ మౌర్య స్పందిస్తూ చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్ఎలు కొన్ని ప్రతిపాదనలు చేయడం వల్ల మరికొన్ని గ్రామాలు చేర్చే అవకాశం ఉందని, ఇది ఆమోదం పొందిన తరువాతే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.



అజెండా అంశాలపై వాగ్వివాదం



స్కిట్‌లో తల్లిదండ్రులు, విద్యార్థుల నిరసన

స్కిట్‌లో సీటు..కలికిరిలో పాఠాలు..!

ఇంజినీరింగ్ విద్యార్థులు ససేమిరా..!
స్కిట్ వద్ద తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఎన్నో ఆటుపోట్ల అనంతరం తిరిగి ప్రాణం పోసుకున్న స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల కథ మళ్ళీ మొదటికొచ్చింది. ఇక్కడ తరగతులు నిర్వహించలేమంటూ జేఎన్టీయూ తెగేసి చెప్పడంతో విద్యార్థుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. మీకు తరగతులు కావాలంటే కలికిరికి రావాలంటూ జేఎన్టీయూ నుంచి స్కిట్‌కు ఆదేశాలు జారీ కావడంతో విద్యార్థులు ససేమిరా అన్నారు. మా పిల్లలను అక్కడికెలా పంపుతామంటూ శుక్రవారం తల్లిదండ్రులు స్కిట్ ఇంజినీరింగ్ కాలేజీ ఎదుట నిరసనకు దిగారు. వివరాల్లోకి పోతే.. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయానికి అనుబంధంగా నడుస్తూ ఓ వెలుగు వెలిగిన స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల పాలనా వైఫల్యాల కారణంగా మూతపడే స్థాయికి చేరింది. వైసీపీ హయాంలో దీన్ని నిర్వహించలేమనీ, మూసి వేయాలని ఆలయాధికారులు ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. అక్కడి విద్యార్థులను పలు కళాశాలలకు, సిబ్బందిని ఇంటికి పంపేశారు. ఈ క్రమంలో కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొజ్జల సుధీర్ రెడ్డి తన తండ్రి మానస పుత్రిక స్కిట్ కు మళ్ళీ జీవం పోస్తానంటూ హామీ ఇచ్చారు. ఆ మేరకు స్కిట్‌ను జేఎన్టీయూ అనుబంధంగా నడిపేందుకు అధికారిక ఉత్తర్వులు తీసుకొచ్చారు. రెండో కౌన్సిలింగ్‌లో జేఎన్టీయూ శ్రీకాళహస్తి పేరిట అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల నుంచి 40 మంది విద్యార్థులు అధికంగా కంప్యూటర్ సైన్స్ కోర్సులో అడ్మిషన్లు పొందారు. వీరందరికీ ఈ నెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే మౌళిక వసతుల కొరత దష్ట్యా ప్రస్తుతం ఇక్కడ తరగతులు నిర్వహించలేమనీ, విద్యార్థులను కలికిరికి పంపాలని జేఎన్టీయూ స్కిట్ ప్రిన్సిపాల్ కు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తిరగబడ్డారు. కౌన్సిలింగ్ లో శ్రీకాళహస్తి అని చెప్పి ఇప్పుడు కలికిరి ఎందుకు పొమ్మంటారని ప్రిన్సిపాల్ ను నిలదీశారు. జేఎన్టీయూ నోటిఫికేషన్‌లో జేఎన్టీయూ-శ్రీకాళహస్తి అని పేర్కొన్న కారణంగానే తమ పిల్లలను ఇక్కడ అడ్మిషన్లు ఇప్పించామని తెలిపారు. రెండో కౌన్సిలింగ్ లో కాకుంటే మూడో కౌన్సిలింగ్ లో నైనా తరగతులు నిర్వహించాలనీ, కలికిరికి మాత్రం పోమని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్ నాశనం కాకుండా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్కిట్ ప్రిన్సిపాల్ ను వివరణ కోరగా కంప్యూటర్ ల్యాబ్ కొరత కారణంగా ఆరు నెలల పాటు కలికిరిలో తరగతులు నిర్వహించాలని యూనివర్సిటీ ఆదేశించిందనీ, తమ చేతుల్లో ఏమీ లేదని వివరణ ఇచ్చారు. ఆరు నెలల అనంతరం శ్రీకాళహస్తిలోనే తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రతి గ్రామానికీ సురక్షిత మంచినీరు

విడబ్ల్యూఎస్పీ డైరెక్టర్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రతి గ్రామానికీ సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని విలేజ్ వాటర్ సెక్యూరిటీ ప్లాన్ ఈటీసీ డైరెక్టర్ శంకర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే స్థానిక ఈటీసీ కేంద్రంలో రాయలసీమ జోన్ పరిధిలోని ఎనిమిది జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈవోపీఆర్డీలకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. 11వ బ్యాచ్ అధికారులకు శుక్రవారంతో శిక్షణా తరగతులు ముగిశాయి. గ్రామీణ ప్రాంతాల్లో ముందుగానే ఉన్న జల వనరులను గుర్తించి, వాటిని భవిష్యత్తు అవసరాలకు భద్రపరచడమే విలేజ్ వాటర్ సెక్యూరిటీ ప్లాన్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఇందులో భాగంగా తొట్టంబేడు మండలంలోని ఓ గ్రామాన్ని మోడల్ విలేజ్ గా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆ గ్రామంలో మంచినీటి సరఫరా, పారిశుధ్యం, మురుగు కాలువలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నివేదికలు తయారు చేస్తారని అన్నారు. పాత పైపు లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను తొలగించి కొత్తవి నిర్మిస్తారని అన్నారు. అవసరమైన చోట కొత్త బోర్లు వేస్తారని వివరించారు. కొత్త డ్రెయిన్ ల నిర్మాణం చేపట్టి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలు ప్రభుత్వం సేకరిస్తుందని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి నుంచి విలేజ్ వాటర్ సెక్యూరిటీ ప్లాన్ కింద జేజే నిధులతోటి అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయని పేర్కొన్నారు.



ఎవరికి వారే..యమునా తీరే..!!

- కూటమిలో విభేదాలు బహిర్గతం
- సభ్యులు విడివిడిగా ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు శ్రీకాళహస్తిలోని కూటమి నేతలు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఈ విభేదాలు బహిర్గతమయ్యాయి. సభ్యులు ఎవరికి వారు విడివిడిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇందుకు నిదర్శనం. కూటమి నేతలు ఇలా చేయడం శ్రీకాళహస్తిలో చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ ను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈయనతో పాటు 16మంది సభ్యులు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులను ప్రభుత్వం పేర్కొంది. ఇందులో శ్రీకాళహస్తి నుంచి టీడీపీకి చెందిన వాకచర్ల గుర్రప్పశెట్టి, గాదిపాకుల గోపినాథ్, దావులూరు లక్ష్మమ్మ, జనసేన నుంచి దండి రాఘవయ్య, బీజేపీ నుంచి కోలా వైశాలిని మండలి సభ్యులుగా నియమించారు. ఇక ప్రత్యేక ఆహ్వానితులుగా శ్రీకాళహస్తికి చెందిన చాగణం శైలజ, మొక్కపాటి వెంకటరమణనాయుడును నియమించారు. వీరిద్దరూ బీజేపీకి చెందిన వారే.

సాధారణంగా ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయాలంటే..అందరూ కలసి మాట్లాడుకుని..మంచి ముహూర్తం నిర్ణయించుకుని ఒకే వేదికపై పండుగలా ప్రమాణ స్వీకారం చేసే వారు. ముక్కంటి ఆలయంలో అనాదిగా ఇదే సంప్రదాయం వస్తోంది. అయితే ప్రస్తుతం నియమించబడిన ధర్మకర్తల మండలి సభ్యులు ఎవరికి వారే... యమునా తీరే అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాణ స్వీకారం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన వారు వేర్వేరుగా ముహూర్తాలు నిర్ణయించుకున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సతీమణి కోలా వైశాలి ఒక్కరే బీజేపీ నుంచి శుక్రవారం ఉదయం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇక టడీపీకి చెందిన వాకచర్ల గుర్రప్పశెట్టి, గాదిపాకుల గోపినాథ్, లక్ష్మమ్మ వీరి ముగ్గురూ శుక్రవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గా నియమింప బడిన కొట్టే సాయి ప్రసాద్ ఈ నెల 26వ తేదీ ప్రమాణ స్వీకారం చేయాలని ముహూర్తం నిర్ణయించుకుని... అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక దండి రాఘవయ్య, చాగణం శైలజ, మొక్కపాటి వెంకటరమణనాయుడు ఎపుడు ప్రమాణ స్వీకారం చేస్తారో ముహూర్తం ఖరారు కాలేదు. ఒకే ఊరిలో ఉన్న కూటమి నేతలు వేర్వేరుగా ప్రమాణ స్వీకారం చేయడం శ్రీకాళహస్తిలో చర్చనీయాంశంగా మారింది. కూటమి నేతల మధ్య విభేదాలే ఇందుకు కారణమని ప్రచారం జరుగుతోంది.



శ్రీకాళహస్తి ఆలయంలో సభ్యుల ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్యే సమన్వయం ఏదీ...?

ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం విషయంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సమన్వయం చేయలేదనే విమర్శ వ్యక్తమవుతోంది. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సమన్వయం చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు అంటున్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు అందరితో చర్చించి ప్రమాణ స్వీకారానికి ఒకే ముహూర్తం నిర్ణయించి ఉంటే ఈ విమర్శలు వచ్చేవి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తానికి మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం సందర్భంగా కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన మధ్య ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. అయితే ఈ విషయంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించారు. శుక్రవారం ప్రమాణం చేసిన సభ్యుల్లో వారి జన్మదిన తిథిలను బట్టి ప్రమాణం చేశారని వివరణ ఇచ్చారు. ఈ నెల 26వ తేదీన చైర్మన్ తో పాటు అందరూ ప్రమాణం చేస్తారని స్పష్టం చేశారు.

చేపల వేటకు వెళ్లి...గిరిజనుడు మృతి

ప్రజాశక్తి -దొరవారిసత్రం

చేపల వేటకు వెళ్లి గల్లంతైన గిరిజనుడు మతి చెందినట్లు గుర్తించారు.పోలీసుల వివరాల మేరకు... పోలిరెడ్డిపాలెం గ్రామానికి చిందిన మేకల పోలయ్య (23)తనయాలి గ్రామం వద్ద ఉన్న కాళంగి నదిలోకి చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. పోలయ్య ఆచూకీ కోసం గురువారం సాయంత్రం వరకు ఎస్‌డిఆర్‌ఎఫ్ టీమ్ గాలించారు.అయితే గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనబడలేదు. శుక్రవారం ఉదయం తహశీల్దార్ సైలకుమారి, ఎస్ఐ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌డిఆర్‌ఎఫ్ టీమ్ మరోసారి గాలించారు. గల్లంతైన పోలయ్య మృతదేహాన్ని గుర్తించినట్లు తహశీల్దార్, ఎస్ఐ తెలిపారు.



మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో సురేంద్రనాథ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 2024 జనవరి నుంచి ఎంపీటీసీలకు ఇస్తున్న గౌరవ వేతనం మూడువేల రూపాయలు అందకపోవటంతో నిరసనగా సర్వసభ్య సమావేశాన్ని బాయ్ కాట్ చేయాలని ఎంపీటీసీలు నిర్ణయించారు. ఎంపీడీవో సురేంద్రనాథ్ జోక్యం చేసుకొని సర్వసభ్య సమావేశం సజావుగా జరిగేలా చేశారు. దీంతో సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. ముందుగా తహశీల్దార్ భారతి మాట్లాడుతూ మండలంలో ఎక్కువ శాతం డీకేటి భూముల సమస్యలే ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. తను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుమారు 200 మంది నూతన రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు చేసుకున్నారని, పరిశీలించి త్వరలో మంజూరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. సిడిపిఒ శాంతి దుర్గ మాట్లాడుతూ మండలంలో కొన్ని అంగన్వాడి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని నివేదికలు పంపి ఉన్నామన్నారు. అప్పటివరకు ప్రాథమిక పాఠశాల భవనాల్లో అంగన్వాడి కేంద్రాలు నడుస్తాయని తెలిపారు. వ్యవసాయ అధికారి సురేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్లో రైతులకు అవసరమయ్యే యూరియా ప్రస్తుతం రేణిగుంట గోడౌన్లో 7000 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని, రైతులకిచ్చే యూరియా కార్డుల ద్వారా యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు కొనాలని ఏ దుకాణా దారులైనా రైతులను ఇబ్బంది పెడితే అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్డబ్ల్యూఎస్, ఆర్.అండ్.బి అధికారులు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్చన దేవి, వైస్ ఎంపీపీ గెరిటారెడ్డి, వైస్ ఎంపీపీ కన్నలి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి బస్సులో మంటలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: పూతలపట్టు హైవే దగ్గర పెళ్లి బందం ప్రయాణిస్తున్న లగ్జరీ బస్సు మంటల్లో చిక్కుకుంది. నెల్లూరులో జరిగిన వివాహానికి హాజరై తిరిగి బెంగుళూరుకు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ప్రయాణికులకు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. నెల్లూరులో జరిగిన వివాహానికి 27 మంది బంధువులు బెంగుళూరు నుంచి లగ్జరీ బస్సులో బయల్దేరి వెళ్లడం గమనార్హం.

శ్రీసిటీలో 'నిట్టన్ ఇండియా' అదనపు ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన నిట్టన్ వాల్వ్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ నిట్టన్ ఇండియా టెక్ పరిశ్రమ అదనపు ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. హ్యుందాయ్, హొండా, టయోటా, అశోక్ లేలాండ్, రాయల్ ఎన్ఫీల్డ్, యమహా, హెచ్ ఎం ఎస్ ఐ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలకు వాల్వులు సరఫరా చేస్తున్న నిట్టన్ ఇండియా, ఈ విస్తరణతో వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 12 మిలియన్ నుండి 24 మిలియన్ ఇంజిన్ వాల్వ్‌లకు పెంచింది. ఈ సందర్భంగా నిట్టన్ ఇండియా టెక్ మేనేజింగ్ డైరెక్టర్ యంగ్ ఓ కో మాట్లాడుతూ, నిట్టన్ కంపెనీలో 2018 అక్టోబర్ లో ప్రారంభమైన తన ప్రయాణాన్ని, లక్ష్యాన్ని గుర్తు చేసుకుంటూ, సంస్థ అభివృద్ధిలో ఇదొక మైలురాయి అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరించే దిశగా ముందుకు సాగుతాం అన్నారు. నూతన ప్లాంట్ సుమారు 7 ఎకరాల్లో 7,350 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. సంస్థ మొత్తం పెట్టుబడి రూ.257 కోట్లకు పెరిగింది. ఉద్యోగుల సంఖ్య 270 నుంచి 370కి పెరిగి, స్థానిక ఉపాధి అవకాశాలను పెంపొందించిందని పేర్కొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలు అడ్డగింత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని, సరోజినీదేవి లేఔట్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నాల్గవ అంతస్తు నిర్మాణాన్ని శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. నగరంలోని సరోజినీదేవి లేఔట్‌లో అనుమతులు లేకుండా మరో అంతస్తు నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు పరిశీలించామని డిసిపి ఖాన్ తెలిపారు. అక్కడ జరుగుతున్న అదనపు నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేక పోవడంతో సెంట్రింగ్ వర్క్ తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మూర్తి, టిపిఒ వంశీ, టిపిబిఒ సంతోష్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అవినీతి అడ్డాగా విద్యుత్ సంస్థలు

▌రూ.40వేల కోట్లపైమాటే...! రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు అవినీతి అడ్డాగా మారాయని, మూడేళ్లలో రూ.40వేల కోట్లపైనే అవినీతి జరిగిందన్న ఆధారాలు ఉన్నాయని రిటైర్డ్ ఐపిఎస్ ఎబి వెంకటేశ్వర్లు అన్నారు. సెంటర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో 'విద్యుత్ అవినీతి... నింగికేగుతున్న కరెంట్ బిల్లులు' అంశంపై పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఎబి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలోనూ, ప్రస్తుతం ఉన్న రెండు ప్రభుత్వాలు అవినీతి ప్రేమకథను రాష్ట్రంలో సాగించాయని, హీరోలు ఇద్దరైనా హీరోయిన్ మాత్రం ఒకరేనని విద్యుత్ కాంట్రాక్టర్ షిరిడి కంపెనీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. 25 సంవత్సరాల క్రితం వచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల ఫలితం లేకపోగా, విద్యుత్ సంస్థలు నష్టాల బాట పట్టాయన్నారు. అవినీతి పెరుగుతూ పోతే, భవిష్యత్తు తరాలకు భారాలు తప్పవన్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలని కోరారు. ప్రజలను చైతన్యవంతులు చేసి, అందర్నీ కలుపుకొని ఐక్య ఉద్యమాలు సాగించి దోపిడీదారులకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలలో అవినీతి పెరిగిపోతుందని, ప్రతి ఈ ఆర్ సి మీటింగ్ లోను తాను ఈ అంశాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నానన్నారు. అవినీతికి బూర్జువా పార్టీలన్నీ కొమ్ముగా స్తున్నాయన్నారు. వైసిపి అధికారంలో ఉన్నా, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఒకే కాంట్రాక్టర్‌ని ఎంపిక చేసి వేల కోట్ల రూపాయలు పనులు అప్పగించేస్తున్నారని, వీరందరికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అండగా ఉందని గుర్తు చేశారు. కష్ణ పుష్కరాల్లో 170 కిలోమీటర్ల పొడవు విద్యుత్ వైర్లకు కవరింగ్ చేసేందుకు స్వీడన్ నుంచి పరికరాలను దిగుమతి చేసుకొని సుమారు రూ.13700 కోట్ల స్కామ్ చేశారన్నారు. యాక్సిస్ ఎనర్జీ కంపెనీకి యూనిట్ 2.25 పైసలకే వస్తున్న, ప్రభుత్వాలు కుమ్మక్కై యూనిట్ రూ.4.60 పైసలు చెల్లించడం దారుణం అన్నారు. అడిషనల్ లోడ్ పేరుతో, అదనపు కరెంటు బిల్లులు వసూలు చేస్తున్నారని, కానీ ప్రతి ఐదు అదనపులోడ్లకు ఒక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిన ఆదేశిక చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ పాలకులందరూ అదానికి ఊడిగం చేస్తున్నారని, ఆఖరికి తిరుపతి కేంద్రంగా ఉన్న ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సగభాగం అదాన్ని కార్యాలయానికి కేటాయించడం దౌర్భాగ్యం అన్నారు. సిపిఐ నాయకులు రామానాయుడు మాట్లాడుతూ డిస్కముల పరిధిలలో ట్రాన్స్ఫార్మర్లు, ఎలక్ట్రికల్ వైర్లు, పోల్స్ ఏర్పాటు చేయడంలో భారీగా అవినీతి జరిగిందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మూడు నెలల క్రితమే ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇ ఆర్ సి అనుమతులు లేకుండానే కొనుగోలు చేయడం దారుణం అన్నారు. విద్యుత్ సంస్థల అవినీతిని అరికట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికష్ణ మాట్లాడుతూ డిస్కమ్ లలో జరుగుతున్న అవినీతిపై మీడియా సంస్థలు పెద్దగా స్పందించడం లేదని, ప్రతి ఒక్కరూ దీనిపై స్పందించి అరికట్టాలన్నారు. ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ పేదలకు బడుగు బలహీన వర్గాలకు మేలు చేసే అనేక పథకాలను రద్దు చేస్తున్న ప్రభుత్వం, కార్పొరేట్ శక్తులకు మాత్రం లక్షలాది కోట్ల రూపాయలను దోచిపెట్టడం బాధాకరమన్నారు. ప్రతి సంస్థలోనూ కులాలు వారిగా సంఘాలు విడిపోవడం వల్ల అవినీతిని ప్రశ్నించలేక పోతున్నారని అందరూ ఐక్యంగా దీనిపై ఉద్యమించాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు మోహన్ కుమార్ రాజు మాట్లాడుతూ వ్యాపారుల సైతం ఈ అవినీతిపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, భవాని ప్రసాద్, చక్రవర్తి, రిటైర్డ్ ఈఈ దేవేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకష్ణ, బిఎస్పి నాయకులు రామచంద్ర, వెంకటరత్నం, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తెలుగు గంగ కాలువలో పడి ఆవు మృతి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండల పరిధిలోని చిన్న కనపర్తిలో నివసిస్తున్న పాండు, పాడి రైతుగా జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతని ఆవు గురువారం సాయంత్రం తెలుగు గంగ కాలువ ఒడ్డున మేస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందింది. ఈ విషయమై పూడి పంచాయితీ పశు వైద్యాధికారిణి ప్రియంకను వివరణ కోరగా ఆవు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన విషయం వాస్తవమేనన్నారు. వర్షాలతో తెలుగు గంగ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆవు నీళ్లలో పడ్డ కొంతసేపటికి మృతి చెందిందని తెలిపారు. పాడి రైతు పాండుకు నష్టపరిహారం అందించటానికి పై అధికారులకు నివేదిక పంపించామని తెలిపారు. ఆవులు, గేదెలు ప్రమాదవశాత్తు మృతి చెందితే ప్రభుత్వం నుంచి సుమారు 50 వేల రూపాయలు పాడి రైతులకు నష్టపరిహారం కింద అందుతుందన్నారు.

టైలర్ ఆత్మహత్యాయత్నం



అంబులెన్స్‌లో సుల్తాన్ సాహెబ్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, ఐతేపల్లెలో శుక్రవారం సుల్తాన్ సాహెబ్ (35) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. టైలర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సుల్తాన్ సాహెబ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య గ్రామంలోని తన అమ్మగారింటికి వెళ్లి తిరిగి వచ్చే సమయానికి భర్త ఉరివేసుకున్నట్టు గమనించింది. ఆమె కేకలు వేయడంతో పొరుగువారు అక్కడికి చేరుకొని అతన్ని కిందకు దించి, వెంటనే 108కు సమాచారం అందించారు. 108 వాహనం ద్వారా సుల్తాన్ సాహెబ్‌ను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. గొంతు బాగం తీవ్రంగా నలిగిపోయి, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం : కిలివేటి



ప్రజాశక్తి - నాయుడుపేట: కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్పష్టం చేశారు. నాయుడుపేట పట్టణంలోని కిలివేటి నివాసంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 28న చేపట్లనున్న ప్రజా ఉద్యమ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్థానిక వైసీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు సీఎం చంద్రబాబు అప్పణంగా కట్టబెట్టడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మెడికల్ కళాశాలలను మంత్రులు ఎమ్మెల్యేలు ప్రైవేట్‌కు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 14 ఏళ్ళు సీఎంగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రానికి ఇప్పటివరకు ఒక్క మెడికల్ కళాశాలను తీసుకురాలేకపోయారని విమర్శించారు. పది మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలంటే రూ.4800 కోట్లు ఖర్చు అవుతుందని, మూడు లక్షల కోట్ల బడ్జెట్ గల రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ఈ మొత్తాన్ని ఖర్చు చేయలేరా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలోనే 175 నియోజకవర్గాలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయ కక్షతో సీఎం చంద్రబాబు వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను తన అనుచరులకు కట్టబెట్టడం ద్వారా చంద్రబాబు వేల కోట్ల దండుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో ఈనెల 29వ తేదీన వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు చేపట్టి తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక వీఎంపల్లిలో శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. మాజీ సీఎం జగన్, పేదలు వైద్య వృత్తిని చేపట్టాలన్న ఆకాంక్షతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలను కట్టిస్తే, ఉన్న వాడికే వైద్య వృత్తి అన్న చందాన చంద్రబాబు వ్యవహరిస్తున్నాడని అంజూరు మండిపడ్డారు. రూ. 1కే పేదలు వైద్య వృత్తిని పూర్తి చేసేలా జగన్ కలలు కంటే చంద్రబాబు రూ. 7 కోట్లకు వైద్య వృత్తిని కొనుగోలు చేసేలా ప్రైయివేటుకు అమ్మేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పసల రమణయ్య, పసల కృష్ణయ్య, కమలాకర్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రగిరి సబ్ డివిజన్, ఎంఆర్ పల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల శ్రద్ధ వహించి, వారు ఎవరితో మెలుగుతున్నారు, ఎక్కడికి వెళుతున్నారు అనే విషయాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, స్త్రీ-శిశు రక్షణకు కట్టుబడి ఉందని ఎస్పీ పునరుద్ఘాటించారు.

పోక్సో కేసులో ముద్దాయి అరెస్ట్



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పోక్సో కేసులో ముద్దాయి కోలా దిలీప్ కుమార్ (28)ను అరెస్టు చేసినట్లు తిరుపతి ఎస్పీ రవి మనోహర్ ఆచారి తెలిపారు. ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా చర్లపల్లికి చెందిన కోలా దిలీప్ కుమార్ తిరుపతి రూరల్, వెంకటాద్రి అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఉంటున్న ఓ మైనర్ బాలిక కుటుంబంతో పరిచయం ఉన్న ముద్దాయి కోలా దిలీప్ కుమార్, గత ఆరు నెలలుగా ప్రేమ పేరుతో బాలికను వేధించేవాడు. ఈ నెల 22వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో బాలిక ఇంటి వద్దకు వెళ్లి, ఆమె చేతిని పట్టుకొని "నిన్ను ప్రేమిస్తున్నాను, నన్ను ప్రేమించకపోతే నిన్ను, నీ కుటుంబాన్ని చంపేస్తాను" అని బెదిరించాడు. దీనికి బాలిక గట్టిగా అరవడంతో ఆమె తల్లి, అన్న ఇంటి నుండి బయటకు వచ్చి అడ్డుకోవడంతో వారినీ బెదిరించి, చుట్టుపక్కల వారు సమీపించగానే అక్కడి నుండి పారిపోయాడు. ఆ విషయమై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టరాని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, దర్యాప్తు బృందం నిందితుడు కోలా దిలీప్ కుమార్‌ను 23 తేదీన అరెస్ట్ చేశామని తెలిపారు.

రహదారి ప్రమాదాలపై సమీక్ష


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర, జాతీయ రహదారులపై రవాణా శాఖ నిబంధనల అమలు పరిశీలనకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. శుక్రవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో మోటా ర్ వెహికల్ ఇన్స్పెక్టర్లతో రహదారి ప్రమాదాలపై ప్రత్యేక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన



మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లతో సమీక్షలో రవాణాశాఖ అధికారి మురళీ మోహన్

మాట్లా డుతూ ఈ ఏడాది జనవరి ప్రారంభం నుండి కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై తనిఖీలు నిర్వహించి, మోటార్ వెహికల్ చట్టం నిబంధనలు పాటించని వారిపై 565 కేసులు నమోదు చేసి అపరాధ రుసుము, పన్నుల రూపంలో రూ.42,95,331 రూపాయలను వసూలు చేయడం జరిగిందన్నారు. సకాలంలో పన్నులు చెల్లిం చని వాహనాలు, పర్మిట్లు లేకుండా రోడ్లపై తిరిగే వాహనాలు, సరుకు రవాణా చేసే వాహనాలపై ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదు చేశామన్నారు. శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా చిన్నటేకూరు జరిగిన బస్సు ప్రమాదంపై కూడా సమీక్ష నిర్వహించారు. ఇకపై నిర్వహించే తనిఖీలలో వాహన చట్టం నిబంధనల ప్రకారం అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ద్వారం ఉందా లేదాని పరిశీలన చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మోటార్ వాహన తనిఖీ అధికారులు వనం వెంకట సుబ్రహ్మ ణ్యం, దామోదర్ నాయుడు, మోహన్ కుమార్, ఆంజనేయ ప్రసాద్, వెంకటరమణ నాయక్, స్వర్ణలత పాల్గొన్నారు.

వరుస ఏనుగుల దాడులతో భయాందోళనలు



ప్రజాశక్తి - చంద్రగిరి: మొన్న రంగంపేట.. నిన్న చిన్న రామాపురం.. నేడు కూచివారి పల్లి గ్రామాల్లో ఏనుగులు పంట పొలాలపై వరుస దాడులు చేస్తున్నాయి. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, రంగంపేట చిన్న రామాపురం, కూచివారి పల్లి, భీమవరం పరిసర ప్రాంతాల్లో ఏనుగులు పంట పొలాలపై గత పది రోజులుగా దాడి చేస్తున్నాయి. దీంతో రైతులు పంట నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి కూచివారిపల్లి ఎస్టీ కాలనీ ప్రాంతంలో ఉన్న మణి అనే రైతు పొలంలో వరి పంటను ధ్వంసం చేసాయి. రాత్రిపూట 8గంటల పైన ఏనుగుల గుంపులు పంట పొలాల పైకి వచ్చి నాశనం చేస్తున్నాయి. వర్షం కురుస్తున్నప్పటికీ, రాత్రిపూట కంటిమీద కునుకు లేకుండా ఏనుగుల దాడులను నివారించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ఏనుగుల దాడులను నివారించాలని ఈ ప్రాంత ప్రజలు, రైతులు అభ్యర్థిస్తున్నారు.

పడకేసిన పారిశుధ్యం



తిరుమల నగర్ చెత్తకుండీ వద్ద నిల్వ చెత్తను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండల పరిధిలోని ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో నూతనంగా ఏర్పడిన పంచాయతీలలో పారిశుధ్యం పడకేసింది. మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్లస్టర్ పరిధిలో ఇప్పటికి 4 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు చెత్త నిల్వలు ఉంచకుండా శుభ్రం చేయాలని కలెక్టర్ సూచించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. డెంగ్యూ కేసులు నమోదు కావడంతో మలేరియా విభాగ సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య, స్థానిక వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లతో ఆయా ప్రాంతాలను పరిశీలించి సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇచ్చారు. ఇకనైనా సంబంధిత అధికారులు పారిశుధ్య నిర్వహణ పట్ల తగిన జాగ్రత్తలు తీసుకొని, చెత్త నిల్వలు లేకుండా చూడాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అపోలో టైర్ల పరిశ్రమ బస్సులు అడ్డగింత



ప్రజాశక్తి - వరదయ్యపాలెం : చిన్నపాండూరు ఏపీఐఐసీ పరిధిలోని అపోలో టైర్ల పరిశ్రమకు చెందిన కార్మికులను తరలించే బస్సులను స్థానికులు అడ్డగించారు. వివరాల్లోకి వెళితే నాలుగు రోజుల క్రితం అదే పరిశ్రమకు చెందిన బస్సు, ప్రైవేట్ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న కార్మికులు గాయాల పాలయ్యారు. పరిశ్రమ యాజమాన్యం ఈ విషయమై స్పందించకపోగా, తమకు ఎటువంటి సంబంధం లేనట్టు వ్యవహరించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో యాజమాని, గాయాల పాలైన స్థానిక కార్మికులు కుటుంబ సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం అపోలో పరిశ్రమ బస్సులను అడ్డగించి నిరసన తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం, పోలీసులు నిరసన తెలుపుతున్న వారిని బెదిరించి, నిరసన తెలిపితే కేసులు పెడతామని భయపెడుతున్నారని బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

విభిన్న రంగాల సమన్వయంతోనే సమగ్ర ఆరోగ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నర్సింగ్ కళాశాల, ఎస్.ఎన్.డి.టి. విమెన్స్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన రెండురోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ విసి ఆచార్య ఉమ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో హెల్త్ కేర్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఈ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే వైద్య, నర్సింగ్, బయోటెక్నాలజీ, సైకాలజీ , సోషియోలాజివ్ వంటి విభిన్న రంగాల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. ఈ అంతర్జాతీయ సదస్సు బహుశాఖ పరిశోధనకు వేదికగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా ఉషా ప్రాజెక్టు కింద ముంబై ఎస్.ఎన్.డి.టి. మహిళా యూనివర్సిటీ మరియు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మధ్య పరస్పర సహకార అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో, రిజిస్ట్రార్ ప్రో.రజనీ, ఎస్ ఎన్ డి.టి తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి దెబ్బకు జిల్లా విల విల

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రానున్న ఐదు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తాజా వాతావరణ నివేదిక ప్రకారం, బంగాళాఖాతంలోని ఆగ్నేయ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో మరింత బలపడి స్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రానున్న ఐదు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ తీర ఆంధ్రప్రదేశ్, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాల ప్రభావం తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, గుంటూరు, బాపట్ల, కోణసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. వర్షాల సమయంలో నీట మునిగిన ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు మరియు చెరువులు, జలాశయాల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అన్ని శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, 24/7 అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ప్రమాద పరిస్థితులు గమనించినా తిరుపతి కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 0877-2236007 ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఆగని వాన.. ఆరని బురద



ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: గత ఎనిమిది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రహదారులు బురదమయంగా మారాయి. అడుగుకో గుంత పడటంతో ఎక్కడికి ఎక్కడ గోతులలో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. అలత్తూరుకు వెళ్లే రోడ్డు మార్గంలో నిత్యం 3 క్వారీల నుంచి మితిమీరిన లోడుతో లారీలు ప్రయాణిస్తుండటంతో రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో మోకాల్లోతు గోతుల్లో రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారుల గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చినుకు పడితే రోడ్డు చిత్తడే



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నాలుగు చినుకులు పడితే.. నాలుగు నిమిషాలో డ్రైనేజీ నీళ్లు, వాన నీళ్లు మొత్తం రోడ్డు మీద ప్రవహిస్తుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువలు మరమ్మతులు చేయించి నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆర్‌డిఎం గేట్ నుండి ఎంఎం పెట్రోల్ బంక్ వరకు రోడ్డుకు ఇరువైపులా వరద నీరు, మురికి నీరు కలిసి పారుతోందని, డ్రైనేజీని నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

నీట మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు నిండిపోయాయి. కారని చెరువు పొంగి పొర్లుతుండటంతో పొలాలు నీట మునిగాయి. వారం రోజుల క్రితం వేసిన వరి నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కుక్కంబకం గ్రామంలోని చెరువులు తెగిపోవడానికి సిద్ధంగా ఉండడంతో ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మలు సిబ్బందితో కలిసి పంచాయతీలకు వెళ్లి



గ్రామస్తులతో చెరువులు తెగకుండా ఇసుక బస్తాలు వేయించారు. వరద నీటితో నష్టపోయిన రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించి రైతులకు నష్టపరిహారం అందే విధంగా చూడాలని అగ్రికల్చర్ అధికారి షణ్ముగంకు మండల స్థాయి అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు, వీఆర్వో ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గండ్లు పడిన చెరువులకు మరమ్మతులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వర్షాలతో వడమాలపేట మండలం, లక్ష్మమ్మ కండ్రిగ కొత్త చెరువుకు గండి పడింది. పరిసర ప్రాంతాల పొలాలకు ఈ చెరువునుండే నీరు పారుతుంది. వర్షాలతో నీటి మట్టం పెరిగి కట్ట తెగి గండి పడింది. దీంతో ఎస్టీ కాలనివాసులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాలతో చెరువు గండికి శనివారం అధికారులు మరమ్మతులు చేయించారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బొజ్జల



ప్రజాశక్తి - రేణిగుంట: పట్టణంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా జలమయమైన ప్రాంతాలను శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరిశీలించారు. అధికారులతో కలిసి వర్షపు నీరు చేరిన ప్రాంతాలను సందర్శించిన ఆయన, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నవంబర్ 1 నుంచి రాజీవ్ నగర్ డ్రైవ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నంబర్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సమస్యాత్మక రాజీవ్ నగర్‌లో స్పెషల్ డ్రైవ్ జరుగుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. పట్టాల పరిశీలన అనంతరం నకిలీల ఏరివేత, రద్దు కార్యక్రమాలు ఉంటాయని స్పష్టం చేశారు. స్థానిక పిఆర్ అతిథిగృహంలో ఎమ్మెల్యే బొజ్జల శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. 2007-08లో పట్టాల పొందిన లబ్ధిదారులందరూ తమ ఒరిజినల్ పట్టా, ఆధార్ కార్డులను అధికారుల పరిశీలనకు ఉంచాలన్నారు. నవంబర్ 10వ తేదీ లోగా పట్టాలను అధికారుల పరిశీలనలో ఉంచకుంటే రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో, రెవెన్యూ అధికారులు పాల్గొంటారని వివరించారు. రాజీవ్ నగర్ డ్రైవ్ లో నకిలీ పట్టాలు, అదనపు పట్టాలు కలిగి ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-ఏర్పేడు:పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఎన్ శ్రీకాంత్ రెడ్డిలు శుక్రవారం విద్యార్థులకు "సైబర్ క్రైమ్‌ను నివారించడంలో యువతది కీలకపాత్ర" అను అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పోలీసు అమరుల ఆత్మకి శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో టి. ఇమామ్ హుస్సేన్ బాబా, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రేణిగుంట : అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోలీసులు విద్యార్థుల్లో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. పీఎస్ఐ స్వాతి, ఏఎస్ఐ పార్వతి, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, ట్రాఫిక్ అవేర్‌నెస్ నివారణలో యువత పాత్ర అంశంపై రైటింగ్ టెస్ట్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు పోలీసు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐగా బాధ్యతలు చేపట్టిన సురేష్ కుమార్

ప్రజాశక్తి - చంద్రగిరి:తిరుపతి జిల్లా, చంద్రగిరి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్సెస్పెక్టర్‌గా సురేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత మూడు నెలలుగా భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా చంద్రగిరి ఇన్చార్జ్ సీఐగా పనిచేసారు. అయితే టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా ఉన్న సురేష్ కుమార్ బదిలీపై చంద్రగిరికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన మాట్లాడుతూ చంద్రగిరి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షణ ధ్యేయంగా పని చేస్తానన్నారు.

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి - చిల్లకూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్ని జిల్లాల సీఈఓలకు ఆదేశాలు జారీ చేయడంతో, అందులో భాగంగా శుక్రవారం చిల్లకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని నెల్లూరు జిల్లా పరిషత్ సీఈవో జె.మోహన్ రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా చిల్లకూరు మండల పరిధిలోని కడివేడు గ్రామపంచాయతీని ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఉన్న దళితవాడలను పరిశీలించి, మౌలిక వసతు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. కడివేడు గ్రామపంచాయతీని ఎంపిక చేసి 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. 15 లక్షల రూపాయలు సీసీ రోడ్డు నిర్మాణానికి, ఐదు లక్షల రూపాయలు తాగునీటికి ఖర్చు చేస్తారని తెలిపారు. అనంతరం మండల కార్యాలయంలో రికార్డులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు మార్చుకోకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని శానిటేషన్ తరచూ చేపట్టాలని ఎంపీడీవో గోపి, యుఆర్‌డి శ్రీనివాసులకు సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - నాయుడుపేట:నాయుడుపేట, తుమ్మూరు 33/11కేవీ సబ్ స్టేషన్ మరమ్మత్తులు చేయడం కోసం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని నాయుడుపేట విద్యుత్ శాఖ ఏఈ ఈ ఎన్ శివశంకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. తుమ్మూరు సబ్ స్టేషన్ నుండి వెళ్లే 11కెవి, మార్కెట్ ఫీడర్ 11 కెవి శివాలయం ఫీడర్ లోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. నాయుడుపేట పట్టణంలోని తేజ సెంటర్, మంగపతి నాయుడు నగర్, కుమ్మరి వీధి, బేరిపేట, ఆర్ముగ నగర్, రజకుల కాలనీ, మార్కెట్ వీధి, శివాలయం వీధి, చిన్న దర్గా రోడ్, బ్రాహ్మణ వీధి, గిండివారి తోట, బజార్ వీధి, గరిడి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈఈ శివశంకర్ కోరారు.

తిరుమలలో జలాశయాల జలకళ



గోగర్భం డ్యామ్ గేటు ఎత్తివేత

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఐదు ప్రధాన జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. తిరుమలలో పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి. వరదనీటి ప్రవాహంతో మొత్తం ఐదు జలాశయాల్లోకి నీరు చేరుకుంటోంది. గోగర్భం డ్యామ్ పూర్తిగా నిండిపోవడంతో ఒక గేటును తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుత నీటి నిల్వలు తిరుమలకు 215 రోజుల తాగునీటి అవసరాలకు సరిపోతాయి. శుక్రవారం ఉదయం 8 గంటల సమయానికి జలాశయాల నీటిమట్టం వివరాలు ఇలా ఉన్నాయి.

డ్యాంల్లో నీటి నిల్వల వివరాలు (లక్షల గ్యాలన్లు)

డ్యాం	నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
1. పాపవినాశనం	5,240.00	4890.65
2. గోగర్భం	2833.00	2804.89
3. ఆకాశగంగ	685.00	537.00
4. కుమారధార	4258.98	3739.05
5. పసుపుధార	1287.16	548.16

అరణియార్ గేట్లు ఎత్తివేత

పిచ్చాటూరు : గత ఏడేళ్లుగా అరణియార్ పూర్తిస్థాయిలోనిండి అధిక వరద నీటిని గేట్ల ద్వారా విడుదల చేసే భాగ్యం తనకు కలిగిందని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం భావోద్వేగంతో అన్నారు. భారీ వర్షాలకు ప్రాజెక్టు నీటి మట్టం 28.5 అడుగులకు చేరుకుంది. జలాశయం పైనుంచి సుమారు 600 క్యూసెక్కుల వరద నీటిని శుక్రవారం మధ్యాహ్నం రెండు గేట్లు ఎత్తి కిందకు విడుదల చేశారు. అరణియార్ ప్రాజెక్టును నమ్ముకుని పదివేల ఎకరాల ఆయకట్టు రైతులు, రెండువేల మంది మత్స్యకార్మికులు జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అభివద్ధికి జైకా నిధులు రూ.35 కోట్లు మంజూరు చేసి ఆధునికీకరణ పనులు ప్రారంభించామని, సుమారు రూ.2.5 కోట్లు తుడా నిధులతో వ్యూ టవర్, చిల్డ్రన్స్ పార్క్, బోటింగ్ వంటి సదుపాయాలతో పర్యాటక అభివద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, అరణియార్ ఆయకట్ట చైర్మన్ రవి రెడ్డి, ఇరిగేషన్ డిఈ శ్రీనివాసులు, ఏఈఈ ధరణి కుమార్, ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్ రాజు పాల్గొన్నారు.

కల్యాణిడ్యామ్‌లో పర్యాటకులకు అనుమతి నిరీకరణ

చంద్రగిరి : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని కల్యాణి నదిపై నిర్మించిన కల్యాణిడ్యాం నీటిమట్టం పెరిగింది. దీంతో పర్యాటకులను డ్యాం వద్దకు అనుమతించడం లేదు. రెండు రోజుల ముందు 836 అడుగులు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 860 అడుగులకు చేరుకుంది. రాగిమానుగుంట, అనుమ కోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగుల నుంచి వరద నీరు ఎక్కువగా వస్తోంది.

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కువైట్‌లో పర్యటిస్తున్న తుడా చైర్మన్ తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డితో ఏపీఎన్ఆర్‌టీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి గల్ఫ్ దేశాలలో తెలుగు వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిస్థి తుల గురించి తెలియజేసారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వ సహకారం అందిం చాలని, రేణిగుంట విమానాశ్రయం నుండి కువైట్‌కు విమాన సర్వీసులు తీసుకురావాలి కోరారు. దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఏపీ ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి టీటీడీ నిధులు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధులు రూ.2.50 కోట్లు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఆ మేరకు గురువారం దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మూలస్థాన ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని టీటీడీని కోరారు. దీంతో మే 20న జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ మొత్తాన్ని కేటాయిస్తూ చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. నిధుల విడుదలకు అనుమతి కోరుతూ టీటీడీ ఈవో రాసిన లేఖకు స్పందించిన ప్రభుత్వం తాజాగా అనుమతి జారీ చేసింది. టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి విడుదల చేస్తున్న ఈ నిధులతో ఎల్లమ్మ ఆలయానికి ప్రాకారం, ఆలయం లోపల రాతి ఫ్లోరింగ్, స్టోర్ రూమ్ నిర్మాణాలు చేపట్టనున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఏ.పీ.ఎస్.ఆర్టీసీ అండ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో తిరుపతిలో ఈనెల 23,24 తేదీలలో రెండు రోజులు పాటు జరిగిన 13వ రాష్ట్ర మహాసభలలో నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీలో రాష్ట్ర సహాయ కార్యదర్శిలుగా తిరుపతి జిల్లా గూడూరు డిపోకి చెందిన కామ్రేడ్ కె.శ్రీనివాసులు, కామ్రేడ్ జి.వినీల ఎన్నికయ్యారు. వారు గూడూరు సిఐటియు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య గూడూరు పట్టణ కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వెంకటగిరి: వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నేదురుమల్లి నివాసంలో శుక్రవారం నియోజకవర్గ నాయకులు , కార్యకర్తలు ఈ నెల 28వ తేదీన ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రంలో జరిగే ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి చిట్టే హరికృష్ణలు మాట్లాడుతూ.. ఈనెల 28న ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం దగ్గర నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు వెంకటగిరి నియోజకవర్గ నాయ కులు, కార్యకర్తలతో కలిసి నిరసన ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యాలయ ప్రారంభానికి సిద్ధం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డిఎల్‌డివో కార్యాలయ పనులను త్వరగా పూర్తి చేయాలని నెల్లూరు జిల్లా జడ్పీ సిఈవో మోహన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని డిఎల్‌డివో కార్యాలయ పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ ఒకటిన రాష్ట్రవ్యాప్తంగా డిఎల్‌డివో కార్యాలయాలు ప్రారంభంకానున్నాయని, ప్రారంభ ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

తిరుపతి మహిళకు.. అమెరికాలో భర్త వేధింపులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: కాలిఫోర్నియాలోని మిల్పిటాస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సాంటా క్లారా కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయంతో సమన్వయంగా, జెస్వంత్ మనికొండ (36) అనే తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐని గృహ హింస, కోర్టు రక్షణ ఉత్తర్వు ఉల్లంఘన ఆరోపణలపై అరెస్ట్ చేసింది. పోలీసుల సమాచారం మేరకు జెస్వంత్ తన భార్యపై గృహ హింసకు పాల్పడినట్లు, బాధితురాలిని రక్షించేందుకు కోర్టు జారీ చేసిన రక్షణ ఉత్తర్వును ఉల్లంఘించినట్లు కేసు నమోదు చేశారు. ఆయనను సాంటా క్లారా కౌంటీ మైన్ జైల్లో బుక్ చేసి, ఎల్మ్‌వుడ్ కరెక్షనల్ ఫెసిలిటీకి తరలించారు.

నిశ్చితార్థానికి హాజరైన ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం పెద్ద గొట్టిగల్లు సమీపంలోని మంగమ్మ గార్డెన్స్‌లో జరిగిన నిశ్చితార్థానికి హాజరయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్.వి.రమణారెడ్డి కుమార్తె జ్యోష్నప్రియదర్శినికి, లలితార్జున్ రెడ్డితో నిశ్చితార్థం జరిగింది. వధూవరులను ఎమ్మెల్యే పులివర్తి నాని, పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలకోన ఆలయ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం పనుల పరిశీలన నిమిత్తం శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని తలకోనకు విచ్చేశారు. ఎమ్మెల్యే రాకతో మండల టిడిపి నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నూతన ఆలయ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు, ఈవోకు సూచించారు. ఆలయ సమీపంలో నూతన వసతులతో నిర్మిస్తున్న గదులను పరిశీలించారు. జనవరి నాటికి మొదటి దశ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.సాయి ప్రసాద్ వాకాడు 1 సచివాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పలు రికార్డులు పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో మురుగునీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వీధుల్లో ఫాగింగ్ చేయాలని, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించాలని సిబ్బందికి సూచించారు. ఈకేవైసీ, బయోమెట్రిక్ అప్డేషన్ పై జరుగుతున్న సర్వే వివరాలను తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవల్లిక, వాకాడు సర్పంచ్ బండి వెంకటరత్నమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం బాలికల రక్షణ, సైబర్ క్రైమ్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్‌లు ఎక్కువగా వాడటం వలన కలిగే అనర్థాలను గురించి వివరించారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు.

నేమి చంద్ గెహ్లోత్‌కు సత్కారం

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట, రాజస్థానీ మిత్ర మండల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నేమి చంద్ గెహ్లోత్‌ను రేణిగుంటకు చెందిన ఎంఎ జబ్బార్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా శుక్రవారం రేణిగుంటలో గౌరవ సత్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫరీద్ బాబా మాట్లాడుతూ నేమి చంద్ గెహ్లోత్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఆయన వృత్తిరీత్యా వ్యాపారి అయినప్పటికీ తమ ట్రస్టు ద్వారా సమాజ సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ సూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ ఎక్కడండీ..?



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి రైతులను ఆదుకుంటామని భరోసా ఇస్తు న్నారు. అయితే మామిడి కాయలు సబ్సిడీ డబ్బులు కోసం పుత్తూరు వ్యవసాయ కార్యాలయం వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్న రైతులు శుక్రవారం మధ్యాహ్నం12:30 గంటల సమయం అవుతున్న కార్యాలయం తెరచుకోనందున కార్యాలయం బయట గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఫోన్ చేసినప్ప టికీ అధికారులు స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్సిడీకి సంబంధించిన పనులు ఉద్యా న శాఖ అధికారులు చేయాల్సిఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారని, కానీ ఉద్యాన వన శాఖ ఎక్కడుందో తెలియక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యానవన శాఖ కార్యాలయం ఏర్పాటు చేసి, మామిడి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.